తీసుకొచ్చి సోఫాలో కూర్చోబెట్టింది.

"ఏమిటిలా ఉన్నావు? ఏమైంది?" అని అడిగింది వసుంధర.

నీలవేణికి ఏమీ చెప్పే ఓపిక లేదు. తనువూ, మనసూ ఎక్కడికో తేలిపోతుండగా, కళ్ళలోకి కొన ప్రాణాన్ని తెచ్చుకుంది.

వసుంధర కంగారు పడింది.

"చాలా నీరసంగా ఉన్నావు. ఉండు, కాఫీ తెస్తాను" అంటూ లేవబోయింది.

నీలవేణి ఆమె చెయ్యి పట్టుకుని ఆపింది. "వద్దమ్మా... నాకు ఏమీ వద్దు... తిరిగి తిరిగి చాలా అలిసిపోయి వచ్చాను. నీ ఒడిలో నాకు కాస్తంత చోటు ఇస్తావా అమ్మా" అని అడిగింది నీలవేణి, కన్నీటి పొరల మధ్యనుంచి చూస్తూ.

వసుంధర హృదయం ద్రవించిపోయింది. నీలవేణిని గుండెకు అదుముకుంది. ఆ చల్లని స్పర్శకు నీలవేణి మనసులోని దట్టమైన నల్లని విచారపు మబ్బుతెరలు కుండపోతగా వర్షించటం మొదలెట్టాయి.

నీలవేణి వసుంధర ఒడిలోకి జారిపోయి వెక్కి వెక్కి ఏడ్చేసింది.

పది నిముషాలదాకా ఆ వెక్కిళ్ళూ తగ్గలేదు. దుఃఖమూ ఆగలేదు. తరువాత నెమ్మదిగా తెప్పరిల్లుకుని అడిగింది.

"నన్ను క్షమిస్తావా అమ్మా?"

వసుంధర నీలవేణి కన్నీరు తుడిచింది. "నీకు గుర్తుందో, లేదో ఒక రోజున నేను నిన్ను వేడుకున్నాను. నన్ను క్షమించమని."

"నాకు గుర్తుంది... కానీ అప్పుడు నా అహంకారం అణగలేదు. కోపం, రోషం, ఉక్రోషం ఇవే నన్ను నిన్న మొన్నటిదాకా నడిపించాయి. ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. జీవితం అంటే ఆవేశం ఒక్కటే కాదని."

వసుంధర నిట్టూర్చింది. "నీలో ఈమాత్రం మార్పు వచ్చిందంటే నేనే నమ్మలేకపోతున్నాను."

"కాలం చేసిన గాయం నాలో ఈ మార్పు తెచ్చింది. ఒకనాడు శరీరానికి గాయం తగిలి ప్రాణం పోతున్న దశలో నీ దగ్గర కొస్తే, నువ్వే నాకు ఊపిరిపోసి కాపాడావు. ఇవాళ మనసుకు తగిలిన గాయం అంతకు పదింతలు ప్రమాదమైనవి. ఇప్పుడూ ప్రాణం పోతున్న దశలోనే నీ దగ్గరకు వచ్చాను" అని చెప్పుకుంది.

వసుంధరకు ఆ పిల్లమీద ప్రేమాభిమానాలు పెల్లుబికిరాగా, మళ్ళీ ఒడిలోకి లాక్కుంది. అయినా నీలవేణి తలెత్తి తన గుండెఘోషను వినిపించచేసుకుంది.

"నిన్నూ శ్యామలరావుగారినీ ఇద్దర్నీ ఒకేసారి చంపాలని ప్లాన్ చేసి..."

"నాకు అర్థమైందిలే" అంటూ నీలవేణిని చిన్నపిల్లలాగా గుండెకు అదుముకుంది.

"నేనేమో నిన్ను చంపాలని చూశాను-నువ్వేమో నన్ను..."

"ఇంకేం మాట్లాడకు" అంటూ ఒళ్ళో పడుకోబెట్టుకుని చిచ్చుకొట్టింది.

అలసిన నీలవేణి పసిపాపలా నిద్రపోయింది. ఆమె నిద్రలో మంటలు ఆరిపోయాక తగలబడిపోయిన మహారణ్యాల మధ్య తిరుగుతోంది... వెర్రిగా దేనికోసమో వెతుక్కుంటోంది.

[సశేషం]




"తొందరగా పని పూర్తిచేసుకు వెళ్ళిపోండి. ఎంతకని అలా నన్ను చూస్తారు?" అని నా మీద చేతులూ వేసి నన్ను దగ్గరికి లాక్కుందామని ప్రయత్నించిన ఆ అమ్మాయిని కొంచెం గట్టిగానే విదిలించుకున్నాను.

"నిజంగా మీ కక్కర్లేదా?" అంది ఆ అమ్మాయి; నా నుంచి పూర్తిగా విడిపోతూ, తెల్లబోయి.

"నిజంగానే నా కక్కర్లేదు" అన్నాను.

"మరి ఈ వీధికి ఎందు కొచ్చేరు? డబ్బు కూడా ఇచ్చి లోపలి కొచ్చేరే! ఎవరు కావాలని మా 'అమ్మ' అడిగితే ఐదుగుర్లో నన్నే ఎంచుకున్నారే!" అంది తను.

"నీలాంటి అమ్మాయి లుంటారని నాకు తెలుసు గాని, నాలాంటి అబ్బాయి లుంటారని నీకు తెలీదు. నేనేం నపుంసకుణ్ణి కాదు. నా క్లాస్మేట్లు నలుగుర్నీ నువ్వు చూశావు కదా! వాళ్ళతో పాటుగా సరదాగా కలకత్తా వీధులు తిరగడాని కొచ్చాను. అందులో ఒకడికి పుటింది ఈ బుద్ధి; ఏదీ, ఈ వీధికి రావాలనీ, ఈ అనుభవం పొందాలనీ. మిగతా నలుగుర్లో నాలాగ నిజంగా ఇష్టం లేని వాళ్ళెవరైనా ఉన్నారేమో నాకు తెలీదు. నాకు మాత్రం నిజంగానే ఇష్టం లేదు!" అని వివరంగా చెప్పేను.

ఆ అమ్మాయి నవ్వింది. "నేను నపుంసకుణ్ణి కాదు" అని నేను ముందే చెప్పి ఉండక పోతే ఆ నవ్వుని "నువ్వు నపుంసకుడిలా ఉన్నావే!" అని అనువాదం చేసుకోవచ్చు.

"ఐతే బయటకెళ్ళిపోతా రా?" అంది.

"వెళ్ళను" అన్నట్టు చేత్తో ఆంగికం చేసి-"మాలో మిగిలిన నలుగురూ ఎప్పుడెళతా రో. అప్పుడే నేనూ వెళతాను. అందాకా నీ కభ్యంతరం లేకపోతే కబుర్లు చెప్పు" అన్నాను, మంచం మీద కూర్చుంటూ.

"ఏం కబుర్లు?" అని ఇంతకు ముందే సిగ్గు వదిలేసి నా మీద పడిన ఆ అమ్మాయి సిగ్గుతో నవ్వింది. నా కందుబాట్లో ఉన్న ఆ అమ్మాయి చెయ్యి పట్టుకుని మెల్లిగా లాగేను. వచ్చి నా పక్కని కూచుంది.


"నీ పేరేంటి?" అన్నాను చనువుగా.

"చారులత. నీ పేరేంటి?" మళ్ళీ నా మీద, చెయ్యి వెయ్యబోతే తప్పించాను.

"శేషాద్రి అంటే ఏమిటో తెలుసా? మా ఆంధ్రప్రదేశ్‌లో 'తిరుపతి' అని ఒకటి ఉంది. అక్కడ దేవుడు ఏడుకొండల అవతల ఉన్నాడు. అందులో ఒక కొండ పేరు శేషాద్రి."

"నువ్వు కొండవా, అయితే?"

"అవును. కొండనే. నువ్వు లతవి. చారులతవి. అంటే మృదువైన లతవి. లత కొండ మీదికి




పాకుతుందా?''

మళ్ళా నా మీద రెండు చేతులూ వేసింది. కవ్వింపుగా నవ్వి, ''పాకుతా నంటే ఒద్దన్నావు'' అంది.

మళ్ళీ ఆ చేతులు తప్పించేను. ''చదువుకున్నావా?'' అన్నాను.

''హయ్యర్ సెకండరీ ఫేల్డ్.''

''మరెందుకు, ఇలా—?'' ఆపైన ఏ మనేదీ నా నోటికి రాలేదు.

''నాన్నకి పక్షవాతం. అమ్మ జూట్‌మిల్‌లో పని చేసేది. రెండేళ్ళ కిందట చచ్చిపోయింది. తమ్ముడికి ఆరేళ్ళు'' అంది చారులత, విషాదాన్ని కథా ధోరణిలో చంపేస్తున్న స్వరంతో.

ఈ మృదువైన లతకి పద్దెనిమిది వసంతాలు నిండేయో లేదో, రెండేళ్ళ నుంచి ఈ వృత్తిలోకి చేరిపోయింది. మరీ తల్లి చచ్చిపోయిన మర్నాడే ఈ రొంపిలో దిగెయ్యక పోయినా, ఫ్యాక్టరీ వాళ్ళు ఆ తల్లి చచ్చిపోయిన తరువాత ఇచ్చిన డబ్బు అయిపోగానే చేరి ఉంటుంది. ఒక ఏడాది అయుండడం నిస్సంశయం.

''సంపాదన సరిపోతుందా?''

''ఆ!'' అంది. దానికి అర్థం ''నా మొహం సరిపోడం!'' అనైనా చెప్పొచ్చు, లేదా ఏదో అంతంత మాత్రం అనైనా చెప్పొచ్చు. అంత చక్కగా అంది. ఆ ''ఆ.''

''రోజుకి ఎంత సంపాదిస్తావు? రోజూ నీ దగ్గరికి ఎంతమంది మగాళ్ళు వస్తారు'' ఇలాంటివి అడగాలని ఉంది. కాని నా చిన్న మెదడు ఆ ప్రశ్నల్ని ఆపివేసింది.

''ఇల్లుందా?''

''షెడ్డు.''

''రాత్రంతా ఇక్కడే ఉంటావా?''

''లేదు. పదకొండు గంటల్లోగానే వెళిపోతాను. అమ్మ నా గురించీ పుచ్చుకున్న దాంట్లో సగం ఇస్తుంది. అది ఎంతయితే అంత—''

### అరిటాకు

''అరిటాకు వంటిది ఆడదాని జీవితం అన్నారెవరో...అదంతా అబద్ధం అంటా న్నేను'' అన్నాడు అయోమయం.

''ఏం? ఏం జరిగింది?'' అడిగాడు అభిరామం.

''నిన్నొక అమ్మాయిని డాష్ ఇస్తే అక్కడున్న వారంతా నన్నే తన్నారు. ఈరోజు ఒక అమ్మాయి నాకు డాష్ ఇచ్చినా నన్నే తన్నారంతా'' అన్నాడు అయోమయం.

నందిగాం మురళీమోహన్.

''మీ నాన్నకి తెలుసా, నువ్విలా— అని?''

కళ్ళు పెద్దవి చేసి గుండెల మీద చెయ్యేసుకుంది. ''చంపేస్తాడు.''

''ఎలా చంపేస్తాడు? అసలే పక్షవాతం. అతను లేచి కర్రో కత్తో ఎత్తే లోగా నువ్వు పారిపో'' అన్నాను తేలిగ్గా నవ్వి.

''అలా అనుకోకు. ఎడం చెయ్యి వాటం మనిషి. ఆ చెయ్యి గట్టిగానే ఉంది. ఆ ఒక్క చేత్తోనే రెండు డ్రమ్ముల నీళ్ళు తోడుతాడు.''

''అన్ని నీళ్ళెందుకు?''

''ఎదుటింట్లో ఆవిడ నెలకీ పది రూపాయలిస్తుంది. ఆవిడ మోసుకోగలదు కాని తోడుకోలేదు.''

''నీ కెన్నేళ్ళు?''

ఎడం చెయ్యి జాపింది. ముంజేతి మీద బెంగాలీలో పచ్చబొట్టుతో ఏదో రాసి ఉంది. అది బహుశా ''చారులత'' అయి ఉంటుంది. నాకు బెంగాలీ మాట్లాడడమే గాని చదవడం రాదు. ఆ అక్షరాల పక్కని 1940 అని అంకె ఉంది.

''1940 ఏళ్ళా?'' అన్నాను నవ్వి.

చిన్న లెంపకాయ కొట్టింది నన్ను. నవ్వుతూ; ''అది నా పుట్టిన సంవత్సరం.''

''ఈ అక్షరాలేమిటి?''

''అది నా పేరు. చారులత.''

# నెత్తురంటుకున్న నిట్టూర్పు

ఏమంటున్నాను నీ నిట్టూర్పును
చిట్లిపోయిన నరాలను
నా చెవిలో ఊదుతున్న నిట్టూర్పును
ఎంత నెత్తురంటుకుందో ఆ నిట్టూర్పుకు
అది అంటదు
మూల పీఠాలువేసుకున్న వట వృక్షాలకు
గాలి చిత్రాలు గీసుకున్న అంతరిక్షాలకు
అది గింగురు మంటుంది
మట్టి ఒడిని కరచుకునే గడ్డి పోచల్లో
నింగి చేలో పొడుచుకొచ్చే మెరుపు పోచల్లో
ఇప్పటిదా ఈ నిట్టూర్పు?
ఎన్ని శతాబ్దాలుగా గుచ్చుకుంటూ ఉందో
కాలం గుండెంలో గాలంలా?
పలాయనవాదులు తప్పుకుంటారు
ప్రశ్నలా అది ఢీకొన్నప్పుడు
ప్రగతివాదులు మెచ్చుకుంటారు
బాంబులా అది పేలినప్పుడు.
నీరసంగా కారిపోయే నిట్టూర్పు కాదది
నిరసన కంఠాలను తొడుక్కున్న మౌనఝంఝ
రుధిరాగ్నిని నాభిలో దాచుకున్న ప్రళయాబ్ధి!

డా. సి. నారాయణరెడ్డి

"చారులతని ముద్దెట్టుకోనా?" అన్నాను నవ్వి.

"డబ్బిచ్చావు కదా. ముద్దెట్టుకుంటే వద్దంటానేం?"

చారులత ముంజేతి మీదున్న అక్షరాలని ముద్దు పెట్టుకున్నాను.

"అదా, నీ ముద్దు?" అని ఎద్దేవా చేసింది.

"నీ రాత కంటే ఈ రాత బావుంది. అందుకు నా ముద్దు అక్కడే" అన్నాను.

"నువ్వు బాగా డబ్బున్నవాడివా?"

"నీ క్కావాలా?"

తల నిలువుగా ఆడించింది.

"ఎంత?"

"ఐదు వందలు."

"ఏం చేస్తావు?"

"ఈ పని మానేసి వ్యాపారం చేస్తాను."

"నిజంగా వ్యాపారం చేస్తావా, లేక ఇంతకంటే మంచిచోట ఇదే వ్యాపారం మొదలెడతావా?"

"ఛీ!"

బయట శబ్దం. "ఇంకా అవలేదూ?" అని కేక.

"అవుతోంది, అవుతోంది. మిగిలిన వాళ్ళు రానీ!" అంది చారులత.

"వాళ్ళు నలుగురూ రోడ్డుమీద నుంచుని ఈ బాబుని పిలవమన్నారు."

"అయిపోయే—" చారులత లేచింది.

నే నామెని కూర్చోబెట్టాను. "జాగ్రత్తగా విను. ఇవాళ ముప్ఫయ్యో తారీఖు. నాలుగో తారీక్కి నీకు మనియార్డర్ వస్తుంది. మూడు వందలే వస్తుంది. కాని మా స్నేహితుల్ని అడిగి ఇంకో రెండు వందలు పోగేస్తాను. ఏడో తారీకు శనివారం సాయంకాలం ఏడు గంటలకి ఇక్కడే ఉండు. నాకు మీ ఇల్లు—అదే, షెడ్డు చూపించు. మర్నాడు ఉదయం నీకు అయిదు వందలు ఇస్తాను. ఆ సాయంకాలంలోగా నీ వ్యాపారం ఏమిటో నాకు తెలియాలి. కళ్ళారా చూసి నేను ఆదివారం రాత్రి ఖరగ్‌పూర్ వెళ్తాను."

"నిజంగా ఐదు వందలు ఇస్తావా?" అంది-దైన్యం, సంశయం, ఆశ కలబోతగా కళ్ళల్లో నిలిపి.

"నిజంగానే ఇస్తాను కాని నువ్వు ఇంకెప్పుడూ ఈ పని చెయ్యకూడదు. మరీ ఈ వారం రోజులూ వస్తు పడుకోవలసి వస్తుందంటే తప్పా, రేపట్నుంచి ఈ పని మానేయాలి. ఇష్టమేనా?"

కాళ్ళ మీద పడింది. అక్కడ పెద్ద ధూళేమీ లేదు గాని, వేలితో తడిమి, ఆ వేలిని పాపిట్లో రాసుకుంది.

"పద. ఇప్పుడే చూపిస్తాను మా షెడ్డు. వారం రోజులు పోయాక అయినా సరే, నీకు మా షెడ్డు చూపించడానికయినా సరే, మళ్ళీ ఈ కొంపకి రమ్మని ఎవరు చెప్పేరు?"

* * * *

ఖర్గపూర్ ఐ.ఐ.టి.లో చదువు వెలగబెడుతున్న రోజుల్లో సంభవించిన ఆ ఇతివృత్తం అక్కడితో ఆగిపోలేదు. ఆ మరునటి ఆదివారం నేను చారులతకి డబ్బు అందజేస్తూ ఉంటే వాళ్ళ నాన్న నా చేతికి ఒక కాగితం ఇచ్చేడు. అదంతా బెంగాలీలోనే రాసి ఉన్నా, అడుగున రెవెన్యూ స్టాంపు అంటించి సంతకం పెట్టి ఉండడం చేత, అది ప్రామిసరీ నోటు అని గ్రహించాను. సరే మీరు నా కివ్వడమూ నిజమే, నేను పుచ్చుకోవడమూ నిజమే అన్న అపహాస్య ధోరణిలో ఆ కాగితాన్ని మడత పెట్టి జేబులో పెట్టుకుంటూ ఉండగా—"అమ్మాయి మైనరు. అందుచేత నేనే సంతకం పెట్టాను" అన్నాడతను. "ఉదయం నా పేరు, మా నాన్నగారి పేరు, మా కుటుంబ వివరాలు, నా అడ్రసు అన్నీ యాదాలాపంగా అడిగినట్టే అడిగి ఎంత పని చేసింది ఈ చారులత అని ఆశ్చర్యపడడానికి కూడా వ్యవధి లేక సాయంకాలానికి ఖర్గపూర్ చేరాను. పదిహేను రోజుల్లో బెంగాలీలో ఒక ఉత్తరం వచ్చింది. ఊరవతల దాకా తీసుకెళ్ళి బాగా అపరిచితుడని రూఢి చేసుకున్న తర్వాత ఒక బాబు చేత చదివించుకున్నాను. సంతోషించేను. వెంటనే నువ్వు ఉత్తరాలు ఇంగ్లీషులో రాయడం నేర్చుకో అని ఒక్క ముక్క రాసి సంతకం పెట్టి ఓ కార్డు పడేశాను. తిరుగు టపాలో 'నువ్వు బెంగాలీ చదవడం నేర్చుకో' అని ఒకే ముక్క జవాబు వచ్చింది. చారులత సెన్సాఫ్ హ్యూమర్‌ని మెచ్చుకుని ఊరుకున్నాను.

ఈ సాయంకాలం లక్ష్మణరావూ, ఈశ్వర్రావూ "మా ఆస్ట్రేలియా అనుభవాలు" అని టైటిల్ పెట్టకుండా చిన్న ప్రయివేట్ మీటింగ్ కమ్ డిన్నర్ పెట్టి వాళ్ళిద్దరూ కంపెనీ తరఫున ఇటీవల ఆస్ట్రేలియా వెళ్ళి అక్కడ గడిపిన పదిహేను రోజుల్లో అక్కడ వాళ్ళు "ఎంజాయ్" చేసిన మద్యం, మాంసాహారం, మగువాభిరామం ఎంత గొప్పవో—ఒకడు చూచా వ్ఛాగా చెప్తే,మరొకడు మరీ మరీ వర్ణించి-మళ్ళీ మొదటివాడు అందుకుని ఇతగాడు మరిచిపోయిన స్వారస్యాలు తిరగదోడి-అక్కడ ఆడియన్స్‌గా మిగిలిపోయిన ఈ ఊరి చీఫ్ ఇంజనీర్స్ అండ్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులందర్నీ కిర్రెక్కించి వదిలేశారు. లక్ష్మణరావూ, నేనూ ఒక్క కార్లో ఇంటికి వచ్చేం కదా.

తోవలో "మిస్టర్ శేషాద్రీ! నువ్వెప్పుడేనా ఔట్‌డోర్ డేటింగ్ చేశావా?" అన్నాడు.

లేదని ఒప్పేసుకున్నాను.

పరమ చిరాకు పడిపోతూ, "చిన్నప్పుడు భయంవల్లా, ప్రిన్సిపల్స్ వల్లా చెయ్యకపోయినా, నలభై దాటిన వయసులో మనం ఎన్ని ప్రిన్సిపల్స్ వదిలేసి ఎంతెంత సుఖపడుతున్నామో తెలిసి కూడా ఈ ఒక్కటీ ఎందుకు పట్టుకు పాకులాడ్డం!" అన్నాడు.

"అందులో అంత థ్రిల్లుందా?" అని అమాయకంగా అడిగాను. ఇందాకటి మూడ్ తీసుకొద్దామని.

పట్టపగాల్లేకుండా బట్టబయలు చేసి చెప్పేడు. అసలు థ్రిల్లంతా నలభై దాటాకనే అని. దాంతో చారులత మరో మాటు గుర్తొచ్చింది.

కారు గేరేజ్‌లో పెట్టేసి "నేను కొన్ని కాగితాలు చూసుకోవాలి" అని శ్రీమతికి చెప్పేసి చారులత పాత ఉత్తరాల కట్ట తీసి అందులో మునిగిపోయాను.

చారులత నా ప్రైడ్ ఆఫ్ లైఫ్. పావుగంట పరిచయంలో ఆమె జీవితాన్నే మార్చేశాను. నిపుణత గల ఇంజనీర్‌గా నేను డిజైన్ చేసి నిర్మించిన సివిల్, మెకానికల్ ప్రాజెక్టుల్లో ఏదైనా [కూలలేదు] కూలిపోతే నేను విచారించే వాణ్ణి కాదుగాని, "చారులత ప్రాజెక్టు" కూలిపోవడం అసాధ్యం అన్నంత పకడ్బందీగా డిజైన్ చేసేను. "మీ దయవల్ల ఈ ఆరు నెలల్లో మా మనుగడకి సరిపడా సంపాదించుకుని పెట్టుబడి నిలిచేటట్టుగా చూసుకున్నాం-"'... ...

"మీరు చెప్పినట్టు ఇంకా కొంచెం శ్రద్ధగా పనిచేసేనందు వల్ల ఈ ఏడాదిలో మా షెడ్డుని పక్కా ఇల్లుగా తీర్చిదిద్దడానికి ఆరంభం అయింది—"


"మా నాన్న! చచ్చిపోతూ కూడా మీ బాకీ తీర్చలేకపోయానే అనే వేదనను వదల్లేదు. నిజానికి తీర్చలేక కాదుగా! అన్నట్టు ఆ కాగితం

## రిస్టువాచీ

ఓ కుర్రాడు తాతల కాలం నాటి గోడగడియారాన్ని రిపేరు చేయడానికి తీసుకు వెళుతున్నాడు. అది ఓ నడి వయస్సు స్త్రీకి తగిలి ఆవిడ కింద పడిపోయింది. కుర్రాడు ఆవిడ లేవడానికి సాయం చేశాడు. ఆవిడ కోపంగా:

"నువ్వు అందరిలాగా రిస్టు వాచీ పెట్టుకుని ఉంటే ఈ పని జరిగేది కాదుగా" అంది.

'జీవి'




మూడేళ్ళు దాటిపోతే కాలదోషం పట్టేస్తుందిటగా! పోస్ట్‌లో పంపండి. వంద రూపాయలు చెల్లు రాస్తాను.''

''మీ పెళ్ళికార్డు చూసి నేను సంతోషించాలి, అసలు. కాని దు:ఖం ఎందుకు కలిగిందో అర్థం కాలేదు. దుకాణం మీద కూర్చుని బేరం చూడ్డం మానేసి భోరున ఏడ్చేస్తూ ఉంటే మా తమ్ముడు పరుగెత్తుకొచ్చి 'అక్కా, అక్కా! ఏమిటిది? ఎందు కేడుస్తున్నావు? ఎవరికైనా చిల్లర ఎక్కువ ఇచ్చేశావా? క్యాష్ డబ్బా ఎవరన్నా ఎత్తుకుపోయారా'—అంటూ నా భుజాలు పట్టుకు ఊపేస్తే తప్పా తెలివి రాలేదు. నా మనసులో మనసు ఏమిటి కోరింది? మీరు ఇంకో ఆడదాని సొత్తయిపోతున్నారని ఏడవడానికి నా కసలు ఏ లేశ మాత్రమైనా హక్కుందా? 'బాబుజీకి పెళ్ళిరా! వెళ్ళాలంటే ఈ జంజాటం. అందుకని ఏడ్చానురా' అని శాంతపరిచాను. కాని, మీ అయిదు వందల అయిదు రూపాయల ఋణం ఒక్కసారైనా తీర్చుకో లేకపోయానని, అందుకే నా మనసు ఏడ్చిందని చెబితే మట్టుకు వాడు నమ్ముతాడా, మీరు నమ్ముతారా?''

ఆఖరి ఉత్తరం నాలుగేళ్ళ కిందట 1975లో రాసింది. తమ్ముడికి ఉద్యోగం దొరికి సెటిలవ్వడంతో వాడికి మంచి సంబంధం కుదిరి అట్టహాసంగా పెళ్ళైంది. తమ్ముడి మామగారి తోడల్లుడు తన దుకాణంలో రెగ్యులర్ కస్టమర్. యాభై ఏళ్ళుంటాయి. పెళ్ళాం జబ్బు మనిషి. కొడుకు లిద్దరూ పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొంత కాలంగా తన దుకాణంలో సరుకులు కొనడం మీద కంటే తనని కొనడానికి ఉత్సుకత చూపిస్తున్నాడు. ఈ పెళ్ళి కారణంగా దగ్గరయ్యేడు. చుట్టూరా ఉన్న మనుషులు మరీ వేలెత్తి చూపించకుండా ఉండే పద్ధతిలో మనం సహ''వాసం'' చేద్దాం అని సూచన చేసేడు. ''ముప్పయ్యయిదేళ్ళు మీదపడ్డాయి. నన్నిప్పుడు ఎవరైనా పెళ్ళి చేసుకుంటారనుకోవడం అత్యాశ, హానికరం అవుతుంది. యాత్రల నెపం పెట్టి అతనితో నెల రోజుల పాటు ఉత్తర భారతం అంతా తిరి గొచ్చాను. మీ కిచ్చిన మాట తప్పేనని, నేను చేసింది తప్పేనని నా మనసు పదే పదే ఆక్రోశించింది. కాని, నిజం చెప్తున్నాను, నా కొండా; పక్కన ఉన్నది అతనే అయినా మనసులో ఉన్నది నువ్వే, నువ్వే. ఒళ్ళంత తెరిచినా కళ్ళు రెండూ మూసుకునే గడిపాను అతనితో. అందుకనే అతనికి పునర్ యౌవనం సిద్ధించి ధన్యుడయ్యాడు. మరి నాకు పునర్ యౌవనం ప్రసాదించమని ఎవర్నడగను?''—

ఆ ఉత్తరంలో వాళ్ళ తమ్ముడి పెళ్ళి సందర్భంగా తీయించుకున్న గ్రూప్ ఫోటో, దాని కిందగా కాగితం అంటించి ఎవరెవరు అని, పేర్లు, వ్యాఖ్యానం—యాభయ్యేళ్ళ వాడి బట్టలూ, బటలా నున్నగా ఆకర్షణీయంగా ఉన్నాయి.

ఇన్నేళ్ళుగా ఈ కంపెనీ ఛీఫ్ ఇంజనీర్‌గా ఉంటూ, కలకత్తాలోని గార్డన్ రీచ్ వర్క్‌షాప్స్‌తో ఏడాదికి కనీసం పదిసార్లు పని పడితే, ఎవడో వెనకాల్నుంచి తరుముకొస్తున్నట్టు అక్కడ హౌరా స్టేషన్లో రైలు దిగడం, ముందుగా ఏర్పాటు చేసుకున్న గార్డన్ రీచ్ వాళ్ళదో మరొకరిదో కారు తాలూకు డ్రయివరు నాకు స్వాగతం చెప్పి ఆహ్వానించి టెలిఫోన్ ద్వారా రిజర్వ్ చేసుకున్న గెస్ట్ హౌస్‌కి తీసుకుపోవడం, అక్కణ్ణించి కాలకృత్యాలూ, పనీ, పార్టీ, తిరుగు ప్రయాణం-ఇలాగే అయిపోతోంది తప్పా, నాకు బాగా తెలిసిన చారులత అనే ప్రాణి ఒకతె ఉందనీ, ఏడాది కొకసారైనా ఆమెని పలకరిస్తే ఆ పలకరింపు బలంతో ఆమె ఇంకో రెండేళ్ళ పాటు ఆనందంగా గడపగలుతుందనీ, ఆమెని పలకరించడం నా విధ్యుక్త ధర్మం అనీ స్ఫురించనే లేదు. ఆ ప్రదేశానికి కొంచెం అటూ ఇటూగా నా కారు వెళ్ళడం తటస్థిస్తే ఇక్కడెక్కడో చారులత ఉంది అని ఓ మెరుపు మెదడులో మెరవక పోనూ లేదు. కాని-ఈసారి ఆ పొరపాటు చెయ్యను.

రేపు మెయిల్లో బయలుదేరి కలకత్తా వెళ్ళాలి. ఎల్లుండి ఉదయం తొమ్మిది గంటలకి చేరుతాను. గెస్ట్‌హౌస్‌లో రూమ్ సంగతి రేపు ఉదయం ఫోన్ చేసి కనుక్కోమన్నారు. ''ఖాళీ ఉందిగాని, నిరుకు చేరుకుందికి'' అని ఈ సాయంకాలం గార్డెన్ రీచ్ వారు సెలవిచ్చారు. ఈ ఒక్కసారీ అక్కడ దిగకుండా వేరే చోట దిగితే వాళ్ళకి బుద్ధీ వస్తుంది, నాకు చారులతతో ఏకాంతమూ దొరుకుతుంది.

* * * *

జనాభా కంట్రోళ్ళు, ఫామిలీ ప్లానింగ్ పథకాలు ఎంతవరకు విజయవంతం అయ్యేయో తెలుసుకోవాలంటే కలకత్తా[హౌరా] ప్లాట్‌ఫారాల మీద ఓసారి దృష్టి నిలబెడితే చాలు. ఒక ట్రెయిన్ వదిల్తే ఇంకోటి ఎదురుగుండా రాడం, ఒకేసారి నాలుగైదు ప్లాట్‌ఫారాల మీదికి రైళ్ళొచ్చేయడం, ప్రయాణీకులు ఎక్కడం దిగడం, తోపులాటలు, కిలకిలలు, మాటలు, కేకలు, మినీ మీటింగులు, మైకుల్లో కవిత్వం [అదే, ఎవరికీ అర్థం కాని ఎనౌన్స్‌మెంట్లు], హాకర్ల గావుకేకలు, బిచ్చగాళ్ళ దీనాలాపాలు-అంతులేని జనప్రవాహం-అప్పుడే ఈనిన గొంగళి పురుగు సంతానం స్ఫురిస్తూ 'దేశమంటే మనుషులే' అన్న వాడెవడో బలే తెలివిగా అన్నాడ్రా అనిపిస్తుంది. ఒకవేళ హౌరా స్టేషన్ హడావిడి చూసే అన్నాడా అని అనుమానం వేస్తుంది.

''నమస్కారం సార్!''

గార్డెన్ రీచ్ కంపెనీ కారు డ్రైవర్. నమస్కారం చేసిన చెయ్యి వెంటనే దించేసి, నా చేతిలో సూట్‌కేసు అందుకున్నాడు. ''మీటింగ్ సాయంకాలం నాలుగన్నరకి వాయిదా వేసేరు సార్'' అన్నాడు.

''ఐ సీ!'' అన్నాను. గెస్ట్‌హౌస్ సంగతి అతనే చెప్తాడులే అని మేడ మెట్ల వేపు నడుస్తున్నాను. అతనికి అందుకోసం ఇచ్చిన టైం ఒక నిమిషం అయిపోగానే చెప్పాను, ''మేడ మీద వెయిటింగ్ రూములో స్నానం, ధ్యానం చేసేసి రెస్ట్ తీసుకుంటాను. భోజనం కూడా ఎక్కడో చేసేస్తాను. మీటింగ్‌కి నాలుగన్నరకి వస్తాను. నువ్వు మళ్ళీ నా కోసం కారు తీసుకొచ్చే శ్రమ తీసుకో నక్కర్లేదని. నేను చెప్పేనని మీ బాస్‌కి చెప్పు. ఓ.కే?'' అని అతని చేతిలో సూట్‌కేస్ అందుకుని చక చకా మెట్లెక్కేశాను. వాడు తెల్లబోతాడని, వాళ్ళ బాస్ ఈ మాటలు విని దెబ్బ తినేస్తాడని నాకు తెలుసు.

వెయిటింగ్ రూమ్‌లో ఎక్కువమంది లేకపోతే స్నానం అదీ పావుగంట పని. టాక్సీలో వెళితే చారులత ఉండే ''షెడ్డు''కి నలభై నిమిషాల ప్రయాణం. దుకాణం మూయించేసి అదే టాక్సీలో ఏదైనా ఫస్ట్ క్లాస్ హొటల్‌కి వెళిపోతాం. నాలుగు గంటల వరకూ ఏం కబుర్లు చెప్పుకున్నా అడిగేవాడు లేడు. నాలుగన్నరకి మీటింగ్ అంటే పూర్తయ్యేసరికి ఏడు గంటలవుతుంది. వాళ్ళంత పార్టీ, డిన్నరూ అంటారు. నా ''పార్టీ'' వెయిట్ చేస్తూ ఉంటుందని, నా ''డిన్నర్'' హొటల్లో ఉందని జోక్స్ వేస్తూ చెప్పేసి, మళ్ళీ చారులత దగ్గరికి చేరుకుంటాను. రేపు ఉదయం మాట రేపు చూసుకోవచ్చు. రేపు సాయంకాలం మెయిల్‌కి నా టిక్కెట్ సిద్ధం చేసే ఉంటారు కదా కంపెనీ వాళ్ళు!

* * * *

వెయిటింగ్‌రూమ్‌లో ప్రవేశించి ఏ మూల బావుందని చూసుకుంటూ ఉంటే ఓ మూల నుంచి ''హల్లో శేషూ, ఎక్కణ్ణించిరా? బతికించావ్!'' అన్న మాటలు. అటు చూడగానే ఒంటి మీద లుంగీ, తువ్వాలు తప్ప మరేం లేని, శాస్త్రీ...వెంకటి!-మేజర్ వెంకట్!!-ఆనాడు నాతో పాటు కలకత్తా ''సోనా గాచి'' సందుల్లో తిరిగిన ఫైవ్-మెన్-ఆర్మీ కమాండర్, వెంకటి.

''ఇదేమిట్రా ఈ వేషం?'' అన్నాను వాడి పక్క

కుర్చీలో చతికిలపడుతూ.

"ముందు ఓ ప్యాంటూ, చొక్కా నా కిచ్చి తరవాత బాత్‌రూమ్‌కి అఘోరించు. ఈలోపల నువ్వూ నా లాగ తయారవకుండా నీ సూట్‌కేసుకి నేను కావలా ఉంటాను."

"నేనూ నీలాగ తయారవడ మేమిటి? ఇంతకీ నీ బట్టలూ, అవీ ఏవీ? ఎక్కణ్ణుంచి వచ్చావు, ఎక్కడి కెళుతున్నావు?"

ఆ ఉదయమే గౌహతీ నుంచి కలకత్తా వచ్చేడట. వస్తూనే హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళి పని పూర్తి చేసుకుని సాయంకాలం బండికి వెనక్కెళ్ళిపోదామనే ఉద్దేశంతో ఫస్ట్ క్లాస్ వెయిటింగ్‌రూమ్ కొచ్చి గేట్ కీపర్‌కి చెప్పి తుండుగుడ్డా, లుంగీ, సబ్బూ పుచ్చుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళాట్ట. తిరిగొచ్చే సరికి మిగిలిందల్లా ఒంటి మీద బట్టలూ, సబ్బూ తనూ నట.

"నాకేం తెలుసయ్యా, నీ సూట్‌కేసు ఎవరు తీసుకెళ్ళేరో!" అంటా డా గేట్ కీపరు.

"బట్టలూ, డబ్బూ పోతే పోయాయి. నా ట్రావెల్ పాసూ, అంతకన్నా ముఖ్యంగా నా ఐడెంటి టీ బాడ్జీ పోయాయి ఆ పెట్టెతో బాటు" అని బావురు మన్నాడు నలభై రెండేళ్ళ మేజర్ వెంకట్.

"కిందనే కదా, రైల్వే పోలీస్ కంట్రోల్ రూము, కంప్లైం టిచ్చావా" అన్నాను. అదో కొత్త బాధ వచ్చి పడిందిట. ఇతను కంప్లైం టియ్యాలంటే ఇతను అనామత్‌గా వెయిటింగ్ రూంలో చేరిన వాడు కాదనీ, ఫస్ట్ క్లాస్ ప్రయాణీకు డేనని చెప్పడానికి సాక్ష్యమే లేదట. గేట్ కీపర్ కదిలి రాకపోగా తనే వెళ్ళి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కి చెప్పుకుంటే, "అసలు నువ్వెవరో నాకేం తెలుసు, కంప్లైంట్ రాసుకోడానికి? ఈ మిలిట్రీ వాళ్ళతో ఇదే చికాకు. అసలిక్కడ అందరూ దొంగ వెధవలేనని ఆమాత్రం తెలీదుటయ్యా?" అని దబాయించి, ఆఖరికి-"ఇక్కడ నీకు తెలిసిన ఆఫీసర్ ఎవరైనా ఉంటే వారితో బాటు వచ్చి ఫారాలు నింపితే కేసు రిజిస్టర్ చేస్తా"నన్నాట్ట.

వెంటనే ఇద్దరం కలిసి కిందికి దిగాం నా సూట్‌కేసుతో సహా. మేజర్ వెంకట్ ఈలోగా నా స్పేర్ బట్టల్లో ఒక జత తీసుకుని దాంట్లో ప్రవేశించాడు.

పోలీస్ కంట్రోల్‌రూమ్ మహా ఆర్భాటంగా ఉంది. హాలు మధ్యని శ్రీమాన్ ఇన్‌స్పెక్టర్ మహాశయులు ఖాకీ యూనిఫారంలో సింహాసనాధిష్ఠుడై టేబిల్ నిండా ఫైళ్ళతో, చుట్టూరా జవాన్లతో కొలువు తీర్చున్నారు. మా అదృష్టం కొద్దీ వారికి ఎదురుగా ఉన్న రెండు కుర్చీలూ ఖాళీగా ఉన్నాయని వాటిలో చతికిల పడ్డాం. ముక్కూ, చెవులూ మూసుకోవలసినంత కంపూ, గొడవా ఉన్నాయి అక్కడ. ఐనా తప్పదు!

సామాన్లు పోయాయనీ, పర్సులు కొట్టేశారనీ, ఆడాళ్ళని అలగా జనం బలవంతంగా ఏదో చేశారనీ జనం చేస్తున్న పితూరీలూ, టిక్కెట్ లేని ప్రయాణీకు ల్సొర్. అలారం గొలుసు లాగినవాడు సార్, సిగ్నల్ దగ్గిర దిగిపోయినోళ్ళు సార్'-అంటూ చెప్తున్న ఆర్.పి.ఎఫ్. రిపోర్టులు వింటూ విలాసంగా కాళ్ళూపుతున్న ఇన్‌స్పెక్టర్, నా ఐడెంటిటీ కార్డు మీద చీఫ్ ఇంజనీర్ అనే అక్షరాలు చూడగానే అటెన్షన్ లోకొచ్చి చిరు మందహాసంతో నా కొక షేక్ హా ండు పారేశాడు.

"మీరు ఇంతకుముం దొకసారి వచ్చారు" అని మేజర్ వెంకట్‌కి కూడా పాణిగ్రహణ మర్యాద చేసి

తండ్రితో కొడుకు: "స్కూల్లో ఒక డ్రామావేస్తున్నాం డాడీ! అందులో డైలాగ్ పార్ట్ అమ్మచేత చెప్పించుకుంటా. మూకాభినయం మాత్రం నువ్వేసెయ్యాలి."

-'జీవి'

"ఫోర్ నాట్ ఫోర్"కి కేక పెట్టారు. 'త్రి జీరో సిక్స్'కి సంజ్ఞ చేశారు. రైటర్ని రమ్మని బెల్ కొట్టేరు. నిమిషాల మీద ఫారాలు నిండాయి. పుస్తకంలో ఎంట్రీలు పడ్డాయి. త్రి జీరో సిక్స్‌తో చిన్న గొంతుకతో మాట్లాడేరు ఇన్‌స్పెక్టర్‌గారు.

"సూట్‌కేసు, బట్టలు-అర్థమైందా? వాడే అయ్యుంటాడు. వ్యాన్ తీసుకెళ్ళి వాణ్ణీ, సామాన్నీ ఎక్కించుకురా, పో!"

అత న్నలా వెళ్ళనిచ్చి "నో ప్రాబ్లమ్ మేజర్ సాబ్. నలభై నిమిషాల్లో మీ పెట్టె మీ కిప్పిస్తాం" అన్నాడు మేజర్ వెంకట్‌ని ప్రత్యేక దయా వీక్షణాల్తో అనుగ్రహిస్తూ. ఇంతలో ఫోర్ నాట్ ఫోర్ 'చా' పట్టించుకొచ్చాడు.

"అరె, మీరు ఆర్డర్ చెయ్యకుండానే టీ వచ్చిందే!" అన్నాను.

"ఫోర్ నాట్ ఫోర్‌ని పిల్చినప్పుడు ఎదురుగా ఎవరన్నా జెంటిల్మెనుంటే వాడికి అదే ఆర్డరు" అని వివరించి, "ఎలా ఉంది మన మోడస్ ఆపరాండి?" అన్నట్టు నవ్వేడు.

మమ్మల్ని సంతోషపెట్టడం అయిందని ఇన్‌స్పెక్టర్‌గారు మిగిలిన కేసుల మీద దృష్టి కేంద్రీకరించి; అరుస్తూ అదిలిస్తూ డ్యూటీలో పడ్డారని గమనించి, "నువ్వుండు మరి; నేను స్నానం గీనం చేసి అర్జంటుగా సిటీలో కెళ్ళాలి" అన్నాను మేజర్ వెంకట్‌తో.

"ఉండు. నా సూట్‌కేస్ వచ్చేస్తోందిగా! నీ బట్టలు నీ కిచ్చేస్తాను. హార్టీగా పార్టీ కూడా ఇస్తాను" అన్నాడు మేజర్ వెంకట్.

"నువ్వు పార్టీ ఇద్దామనుకుంటున్నా నీ దగ్గిర డబ్బు లేదు. ఇన్‌స్పెక్టరుగారి డైరెక్షన్ విన్నావుగా, సూట్‌కేసు, బట్టలు-అంతే" అన్నాను. "ఏమైనా సరే, ఈ దుర్గంధంలో నే నుండలేను, పోతాను."

"నయమే, గుర్తు చేసేవు. అయితే నా కో వంద రూపాయలు అప్పు కూడా ఇయ్యి నువ్వు."

"వంద కాకపోతే రెండు వందలు పట్టుకెళ్ళు" అని మా ఇద్దరి మధ్యా సూట్‌కేస్ తెరిచాను. చారులత కోసం తెచ్చిన రంగు రంగుల పాలిస్టర్ చీర కవర్లోంచి తొంగి చూస్తూ మేజర్ కంట పడింది.

"సారీ బ్రదర్, ఫేమిలీతో వచ్చేవని చెప్పనే లేదు."

"ఫేమిలీ—"తో"—రాలేదు. "కోసం" వచ్చేను" అని, రెండు వంద రూపాయల నోట్లు తీసి ఇచ్చాను.

"థాంక్యూ ఫర్ ఎవ్విరి థింగ్" అని గొంతు తగ్గించి; "అవునూ, ఆవిణ్ణే ఇంకా మేంటేన్ చేస్తున్నావా లేక వేరే ఎవర్నన్నా—?" అన్నాడు మేజర్ వెంకట్.

"వాట్ డు యు మీన్?"

"నా కంతా తెల్సు లేవోయ్! ఇరవై ఏళ్ళ కిందట మనం సోనా గాచీ సందులో ఎంగేజ్ చేసుకున్న అమ్మాయిల్లో నీ గర్ల్‌ని నీవు విడిచి పెట్టలేదుటగా! తనచేత బిజినెస్ మాన్పించి వచారీ కొట్టు పెట్టించి పెట్టుబడి పెట్టావు, ఆ చారులత గురించే నేను మాట్లాడుతూంట!"

వెంకట్‌కి ఏం చెప్పాలో నాకు తోచలేదు. ఇరవై ఏళ్ళ తరువాత తొలిసారిగా చారులత మీద ఉత్సుకత, అనురాగం ఇప్పుడే కలిగాయనీ, ఆ రాత్రి ఆమెతో నే నసలు శృంగారం చెయ్యనే లేదనీ చెబితే మట్టుకు వెంకట్ నమ్ముతా డా? వెనకటి కెవడో, తన పొదిలో ఉన్న బంగారపు ముద్దని దృష్టిలో ఉంచుకుని, "కోడిగుడ్డంత బంగారం లేని వాడెవడు, ఈ రోజుల్లో?" అనే వాడట. అలాగ్గా, ఆనాటి నుంచి ఈనాటి వరకూ చారులతతో వ్యవహారం చేస్తున్నా ననే అనుకొంటాడు స్వతహాగా పరమ రసిక శిఖామణి అయిన వెంకట్.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! ఈ కంపు భరించలేకుండా ఉన్నామండీ. అసలు ఎక్కణ్ణుంచి వస్తోంది ఈ దుర్వాసన?" అన్నాను, ఏకాగ్రంగా అతని వేపు చూస్తూ, ఆ నెపం మీద వెంకట్‌కి సమాధానం చెప్పే అవసరాన్ని దాటవేస్తూ.

"ఏం చెప్పమంటారు సార్ మా పాట్లు? ఈ అన్ క్లెయిమ్‌డ్ బోడీస్ [దిక్కు లేని శవాల]తో చస్తున్నా ననుకోండి! అన్నింటితో బాటు ఇదో పెద్ద తలకాయ నెప్పిగా తయారైంది. కనీసం వారానికి రెండు శవాలు దిగిపోతున్నాయి ఈ హౌడా స్టేషన్లో. ఏదో చిన్న స్టేషన్ ఏరియాలోనో లేక పల్లెటూళ్ళలో ఇళ్ళల్లోనో మర్డర్లు చేసేస్తారు. ఆ ప్రాంతంలో వదిలేస్తే ఇన్వెస్టిగేషన్ తేలికైపోతుందని, చాప చుట్టలోనో, గోనె సంచిలోనో కట్టేసి రైలెక్కించేస్తారు. ఇక్కడ అన్ని ట్రెయిన్లూ ఆగిపోతా యి కదా! అన్‌లోడ్ చేసేసి ఆ శవాల్ని మా పీకలకి చుడతా రు. నిన్న సాయంకాలం థర్టీ సిక్స్‌లో దిగింది ఒక శవం. అదే ఆ చాప చుట్ట, ఇప్పటిదాకా పంచనామా మెంబర్లు దర్శనాల్లేవు" అని, ఇంకా ఆ తరువాత జరగవలసిన పోస్టుమార్టమ్ మొదలైన లాంఛనాల మీద దండకం వల్లిస్తున్నాడు ఇన్‌స్పెక్టర్.

ఈ సందట్లో వెంకట్ నా సూట్‌కేస్ తెరిచి, చారులత ఉత్తరాలు, ఆమె తమ్ముడి పెళ్ళి సందర్భంగా తీయించుకున్న గ్రూప్ ఫోటో ఉన్న అందమైన ప్లాస్టిక్ కవరు లాగి, ఒక్కొక్కటే పరిశీలిస్తూ, గ్రూప్ ఫోటో చూపించి, "ఇప్పుడేమంటావు బ్రదర్?" అన్నాడు గుట్టుగా, గుస గుసగా.

ఇన్‌స్పెక్టర్‌గారు మరో జవాన్ని పిలిచి "అరే, ఆ చాప చుట్ట కొంచెం దూరంగా నెట్రా యూస్ లెస్ ఫెలో! వినపడ్డం లేదూ, సార్ కంపు భరించలేమంటున్నారు" అని కోప్పడ్డాడు.

వృథాగా తిట్లు తిన్న ఆ కానిస్టేబుల్ ఒక కర్రతోనూ, బూటు కాలితోనూ, ఆ చాప చుట్టని కొడుతూ, తంతూ, జరుపుతూ ఉండగా దానికి కట్టిన చేకు తా డు ఫటక్ మని తెగిపోతూ, ఒక నడి వయసు స్త్రీ శవం బట్టబయలైంది.

నేను ఆ దృశ్యం చూడలేక మొహం తిప్పుకుంటూనే, మరుక్షణం మహాశక్తివంతమైన బంధం ఏదో లాగినట్టు మళ్ళా చూపు అటు తిప్పాను.

ఆ శవం ఎడం చేతి ముంజేతి మీద చారులత-1940 అనే అక్షరాలూ, అంకెలూ పచ్చబొట్టుగా ఉన్నాయి. ఆ పచ్చబొట్టు తప్ప ఆ ఒంటిమీద ఇంకేమీ లేదు.


అసహ్యకరమైన ఆ దృశ్యానికి నా చూపు అంతగా అతుక్కుపోవడమెందుకో ఇన్‌స్పెక్టర్‌కి

అర్థం కాలేదనుకొంటాను. నాతో అన్నట్టు కాకుండా, తనలో అనలే కాకుండా చెప్పేస్తున్నాడు:

''ఓ, ఇదా? ఇది చారులత! సోనాగా చీ నందులో పచారీ కొట్టు మనిషి-మధుకర్‌ఘోష్‌గారు కొన్నాళ్ళు ఉంచుకున్నారు. అతగాడి పెళ్ళాం చచ్చిపోయాక తనని పెళ్ళి చేసుకోమని వెంటబడింది. అతను వదిలించుకున్నాడని అలిగి బ్రోతల్ వ్యాపారం ప్రారంభించి మాతాజీ అయింది. నేను ఆ ఏరియాలో పనిచేసినప్పుడు రెండుసార్లు అరెస్టు చేశాను. దాదాలకీ, దీనికీ పంపకాల దగ్గిర ఎప్పుడూతగాదాలే! చివరికి ఎవడో ఇలా పుణ్యం కట్టుకున్నాడన్న మాట. చెడ్డ కథకి చెడ్డ ముగింపు—''

ఇన్‌స్పెక్టర్ కథ పూర్తిచేస్తూ ఉండగానే గేట్లోంచి త్రీ నాట్ సిక్స్ ఓ చేత్తో వి.ఐ.పి. సూట్‌కేసు, మరో చేత్తో ఎవడిదో మెడ పట్టుకుని లోపలికి ప్రవేశించాడు.

వెంకట్ తన సూట్‌కేస్ తెరిచి అన్నీ ఉన్నాయో లేదో చూసుకునే హడావిడిలో ఉండగానే, నేను నా సూట్‌కేస్‌లోంచి చీర తీసి, మడతలన్నీ విప్పి, ఆ చావ చుట్ట మీద కప్పి, ''నాకు సెలవిప్పించండి మరి'' అన్నాను ఎవర్నీ చూడకుండా-అందర్నీ ఉద్దేశించి. ●




ఆ రోజు జమదగ్ని కూతుర్ని చూసుకోవటానికి పెళ్ళివారు వచ్చారు.

రేవతిని ముస్తాబు చేసి కూర్చోబెట్టారు.

పేరు, చదువు, సంగీతం, అలవాట్లు, అభిరుచులు అన్నీ లాంఛనంగా జరిగిపోయాయి.

పెండ్లికొడుకు తండ్రి శతకీర్తి కొన్ని విషయాలలో జాప్యం భరించలేడు. అందుకే కుండ వగలకొట్టినట్లు చెప్పేశాడు.

''బావగారూ? మీ అమ్మాయి మా అందరికీ నచ్చింది. మిగిలిన విషయాలు ఇప్పుడే, ఇక్కడే మాట్లాడేసుకుందాం. ముందు అమ్మాయి అభిప్రాయం కనుక్కోండి'' అన్నాడు.

సమయం తానకి తందానతాళం వేసింది. అయితే ఇంకేం శుభస్య శీఘ్రం అనుకున్నారు పెద్దలు. ముప్పయివేల రూపాయలు కట్నం, మిగిలిన లాంఛనాలు అన్నీ క్షణాల మీద నిశ్చయమైపోయాయి.

పెళ్ళి పందిట్లో మరచెంబులో ఉన్న నీళ్ళతో పెళ్ళికొడుకు కాళ్ళు కడుగాల్సిన జమదగ్ని ఉబికి వచ్చే కన్నీళ్ళతో వియ్యంకుడి కాళ్ళు కడిగేశాడు.

సారాంశం కట్నండబ్బు సమయానికందక వదివేలు మినహాయింపు। అందుకు ఫలితంగా పీటలమీద పెళ్ళి ఆవవద్దని ప్రాధేయపడటం.

అందరి .గుండెల్లోనూ రైళ్ళు పరిగెడుతున్నాయి- ఈనాటి కట్న కానుకల లోటుకి ఫలితాలు తెల్సుకనక.

పెళ్ళున నవ్వేశాడు శతకీర్తి హుందాగా.

''నాకు ఆడపిల్లలు లేకపోయినా ఆ సాధక బాధకాలు బాగా తెలుసు. అమ్మాయిని కాపరానికి పంపేటప్పుడు మిగిలింది ఇచ్చి పంపుదురుగాని ముందు ముహూర్తం కానివ్వండి,' అన్నాడు మర్యాదగా.

అందరి మనసులు తేలికపడి, శతకీర్తి మంచితనానికి అబ్బురపడి ''వాయించండోయ్ మేళాలు'' అన్నారు ఉత్సాహంగా.

ఫెళ్ళున రేవతి పెళ్ళయిపోయింది.

* * *

పసువు చెంబు, చలిమిడితో మాత్రమే రేవతి కాపురానికి వచ్చింది భయపడుతూనే.

''బావగారూ? సమయానికి సర్దుతాం అన్నవాళ్ళు సర్దకపోవటంతో ఆలస్యం జరిగిపోయింది. ఒక్క నాలుగు నెలలు గడువు ఇవ్వండి చాలు. ఆ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను. ఇవి చేతులు కావు'' అన్నాడు జాలిగా జమదగ్ని.

''ఈ మాత్రానికేనా? మరేం పరవాలేదు చేతికి రాగానే ఇవ్వండి'' అన్నాడు శతకీర్తి.

తేలిగ్గా ఊపిరిపీల్చుకున్నాడు జమదగ్ని.

* * *

పూవులు కాయలై, కాయలు పళ్ళై మిగలముగ్గి రాలిపోయినా జమదగ్ని ఆడిన మాట నిలబెట్టుకోలేదు.

''ఏమండీ ఇంకా ఎంతకాలం ఆ పది వేలకూ కుంటిసాకులు చెబుతారు? వాళ్ళు మంచి వాళ్ళు కాబట్టి సరిపోయింది. ఇదే మరొకరు అయితేనా'' అంటూ భర్తను ఓసారి హెచ్చరించింది జమదగ్ని భార్య.

''ఓసి పిచ్చి మొహమా? వాళ్ళు మంచివాళ్ళు కాబట్టే ఆ డబ్బు ఎగ్గొట్టే ప్రయత్నం. చూడు అమ్మాయి పెళ్ళయి ఏణ్ణర్థం అయినా ఆ డబ్బు గురించి ఒత్తిడి చేయలేదు. పైగా తనను పల్లెత్తుమాటైనా అనకుండా పువ్వుల్లో పెట్టి కన్నకూతురి కంటే ఎక్కువగా చూసుకుంటున్నారు' అని అమ్మాయే స్వయంగా చెప్పింది. ఇంక ఆ విషయం ఎత్తకు'' అన్నాడు తెలివిగా.

''అయ్యో రామా! మర్యాదస్తులతో సటండీ పిల్లాటలు? వాళ్ళకు ఏ కోపం అయినా వచ్చి అమ్మాయిని పంపిచేస్తేనో'' అంది ఆడ మనసు కాస్తంత అనుమానంగా.

''అలా ఎన్నటికీ జరగదు. వాళ్ళు అలాంటి మనుషులు కాదే. చూడు ఆ పది వేలకీ మరో పది వేలు కలిపితే ఆఖరిదాని పెళ్ళి చేసెయ్యొచ్చు. అదీ నా ప్లాను.''

''ఆ!'' అంటూ భర్త తెలివికి తెల్లబోయి బుగ్గలు నొక్కుకుంది.

* * *

''రేవతీ డైడ్. స్టార్ట్ ఇమీడియెట్‌లీ'' అంటూ వచ్చిన టెలిగ్రాం చూసి గొల్లున ఏడుస్తూ ప్రయాణమయ్యారు జమదగ్ని దంపతులు.

రేవతి శవం మీద. పడి అడదాని కన్నా హీనంగా ఏడుస్తున్నాడు భర్త. అత్తమామలు తల బద్దలు కొట్టుకుంటూ చనిపోయిన రేవతి తమ కూతురే అన్నంతగా దుఃఖపడుతున్నారు.

జమదగ్ని దంపతులే శోకం దిగమింగుకుని వాళ్ళని ఓదార్చాల్సి వచ్చింది.

''అక్కడికీ చెబుతూనే ఉన్నాను. వద్దు తల్లీ, ఆ టెర్లిన్ చీరతో స్టౌ దగ్గరకు పోవద్దు అమ్మా అని'' అంటూ గోలు గోలున ఏడుస్తోంది అత్తగారు.

''పాపం ఎంత దురదృష్టమో! ఆ పిల్లని ఏనాడూ చిన్న మాట అని ఎరగరు. కూతురు కంటే ఎక్కువగా చూసుకున్నారు. ఇలాంటి అత్తమామమలూ, భర్తా నూటికో, కోటికో ఒకళ్ళు ఉంటారు.'' చుట్టుపక్కల వాళ్ళు సానుభూతి చూపిస్తున్నారు.

శతకీర్తి దంపతులను, కొడుకును ఓదార్చటం ఎవరి తరం కాలేదు.

రేవతి శవంతో పాటు తను కూడా చచ్చిపోతానంటూ సహగమనానికి సిద్ధపడ్డ ఆమె భర్తను ఆపటం బ్రహ్మప్రళయమే అయింది.

కూతురు పోయిన బాధ కంటే, ఆమె పట్ల వియ్యాలవారికున్న ప్రేమకు ఊరివాళ్ళతో పాటు అబ్బురపడ్డా రా దంపతులు.

* * *

రేవతిపోయి అవాల్టికి పదిహేనవ రోజు.

వియ్యాలవారి ఊరి నుంచి మనిషి వచ్చాడంటే బయటికి వచ్చాడు జమదగ్ని.

''అయ్యా! నన్ను తమ వియ్యంకుడుగారు పంపించారు. రేవు రాత్రి పది గంటలకు మీ అల్లుడి పెళ్ళి. గొప్పింటి సంబంధం. అబ్బాయికి, తలిదండ్రులకి అమ్మాయి బాగా నచ్చింది. కట్నం యాభై వేలు. మోటారు బైకు, కలర్ టి. వి. ఇంకా ఏవేవో ఇతర లాంఛనాలు. వారి ఉత్సాహం చూస్తుంటే నాకే అసూయగా ఉంది సుమండీ. కట్నం డబ్బు నయాపైసా బాకీ లేకుండా ముందే ఇచ్చేశారుటండీ! మిమ్మల్ని మాత్రం పెళ్ళికి తప్పకుండా బైలుదేరి రమ్మన్నారు'' అంటూ చల్లగా జారుకున్నా డా మనిషి.

అప్పటికి మెదడులో లైట్ వెలిగింది. ''అమ్మ శతకీర్తీ, ఎంత తేనె పూసిన కత్తివి'' అంటూ విస్తుపోయాడు కూతురి చావుకి అసలు కారణం అర్థమైన జమదగ్ని. ●